సాక్షి నల్లగొండ

సోమవారం । 12 । ఆగస్టు । 2024



ప్రతి గ్రామంలో గ్రంథాలయం

ప్రభుత్వం ప్రతి గ్రామంలో గ్రంథాలయాలు ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు.

- 8లో



అవగాహన కల్పించాలి

పశుపోషణపై రైతులకు అవగాహన కల్పించాలని రాష్ట్ర గొర్రెలు, మేకల సమాఖ్య ఎండీ డాక్టర్ సుబ్బారాయుడు అన్నారు.

- 8లో



యాదాద్రిలో భక్తుల రద్దీ

యాదాద్రి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. 40వేల మందికిపైగా భక్తులు శ్రీస్వామిని దర్శించుకున్నారు.

- 8లో

న్యూస్‌రీల్

మాదక ద్రవ్యాల నిర్మూలనపై నేడు ర్యాలీలు

నల్లగొండ క్రైం : మాదక ద్రవ్యాలను నిర్మూలించాలని కోరుతూ నల్లగొండలో ర్యాలీ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి బి.సంతోష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటలకు ఎన్జీ కాలేజీ నుంచి ర్యాలీ ప్రారంభమై గడియారం వద్ద మానవహారం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు హాజరై ఈ ర్యాలీ విజయవంతం చేయాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి



ఈద్గా వద్ద మొక్క నాటుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి

మిర్యాలగూడ : పర్యావరణ పరిరక్షణలో ప్రజలంతా భాగస్వాములు కావాలని కలెక్టర్ నారాయణరెడ్డి, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం 'నేను నా మిర్యాలగూడ వన మహోత్సవం' కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఆలగడప ఈద్గా వద్ద మైనారిటీలు మొక్కలను నాటే కార్యక్రమాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. భవిష్యత్ తరాల వారు ఆరోగ్యంగా ఉండాలంటే మనం తప్పకుండా మొక్కలను నాటి వాటిని సంరక్షించాలన్నారు. ప్రతి పౌరుడు కుల, మతాలకు, రాజకీయాలకు అతీతంగా బాధ్యతగా ఐక్యమత్యంతో పర్యావరణాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మూసీకి 731 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. హైదరాబాద్‌తోపాటు, మూసీ పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి ఆదివారం మూసీకి 731 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుంది. ఆయకట్టులో వానాకాలం పంటల సాగుకు ప్రధాన కుడి కాల్వకు 208 క్యూసెక్కులు, ఎడమ కాల్వలకు 185 క్యూసెక్కుల చొప్పున 393 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మూసీ ప్రాజెక్టు గరిష్ఠ నీటిమట్టం 645 అడుగులు కాగా ఆదివారం సాయంత్రానికి 641.70 అడుగులకు చేరిందని ప్రాజెక్టు ఏఈ ఉదయ్‌కుమార్ తెలిపారు. ప్రాజెక్టులో నీటినిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా ప్రస్తుతం 3.62 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

ఇంపాక్ట్ ఫౌండేషన్ సర్టిఫికెట్ల పంపిణీ

నల్లగొండ : ఇంపాక్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నల్లగొండలో రెండు రోజులు నిర్వహించిన ట్రైన్ ది ట్రైనర్ వర్క్‌షాప్ ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా వ్యక్తిత్వవికాస శిక్షణ తీసుకున్న 30 మందికి నిజామాబాద్ ఆర్‌టీసీ ఆర్ఎం సరస్వతి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో నూనె సుదర్శన్, లోడంగి గోవర్ధన్, సరిత, అంజిరెడ్డి, రవి, సాయి, ఆనంద్, జహంగీర్, హర్షిత తదితరులు పాల్గొన్నారు.





పర్యాటక పరవళ్లు సాగర్ జలాశయం వద్ద ఆదివారం 2,57,303 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో.. 93,217 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదైంది. నీటిమట్టం 588.30 అడుగులు (306.9878 టీఎంసీలు)గా ఉంది. సాగర్ సందర్శనకు తరలివచ్చిన పర్యాటకులు, సినీ నటి లయ

30 లక్షల ఎకరాలకు నీరిస్తాం

- ప్రాజెక్టులు పూర్తిచేసేందుకు అవసరమైన నిధులు ఖర్చు చేస్తాం
- నల్లగొండను ఫ్లోరైడ్ రహిత జిల్లాగా మారుస్తాం
- రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- డిండి ఎత్తిపోతల, ఎస్ఎల్‌బీసీ పనులపై డిండిలో సమీక్ష



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యేలు, కలెక్టర్

డిండి : రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడంతోపాటు అవసరమైన చోట నూతన రిజర్వాయర్లను నిర్మించి ఏటా 6 లక్షల చొప్పున ఐదేళ్లలో 30 లక్షల ఎకరాలకు సాగు నీరందిస్తామని రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాల్లోని డిండి లిఫ్ట్ ఇరిగేషన్, ఎస్ఎల్‌బీసీతోపాటు సాగునీటి ప్రాజెక్టులపై ఆదివారం డిండిలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశానికి మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎత్తిపోతల, సాగునీటి ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితిని అధికారులు, కాంట్రాక్టర్లు స్క్రీన్ ద్వారా మంత్రికి వివరించారు. అదేవిధంగా దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్, మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఇరిగేషన్ ప్రాజెక్టుల పురోగతిని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ డిండి ఎత్తిపోతల పథకం, ఎస్ఎల్‌బీసీకి అవసరమైన డబ్బులు కాంగ్రెస్ ప్రభుత్వం ఖర్చు చేస్తుందని, వెంటనే పెండింగ్ పనులు ప్రారంభించి త్వరగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గం పూర్తి చేయడానికి రూ.460 కోట్లతో రివైజ్డ్ ఎస్టిమేషన్ వేసి మంజూరుకు కేబినెట్ ముందుకు తీసుకెళ్లామని గుర్తుచేశారు. డిండి ఎత్తిపోతల పథకం ద్వారా 3.5 లక్షల ఎకరాలకు సాగునీరందించటంతోపాటు దేవరకొండ నియోజకవర్గంలో ఇప్పటివరకే మంజూరైన అంబాభవాని, కంబాలపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలను కూడా పూర్తి చేసి వెనుకబడిన గిరిజన ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

ఫ్లోరైడ్ రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యం

డిండి ఎత్తిపోతల పథకం, ఎస్ఎల్‌బీసీని వచ్చే మూడేళ్లలో పూర్తి చేసి దేవరకొండ, మునుగోడు ప్రాంతాలకు సాగు, తాగునీటిని అందించి నల్లగొండను ఫ్లోరైడ్ రహిత జిల్లాగా మార్చుతామన్నారు. లిఫ్ట్ ఇరిగేషన్‌లో భాగంగా నిర్మిస్తున్న సింగరాజుపల్లి రిజర్వాయర్ పనులు 85 శాతం పూర్తయ్యాయని, ఇటీవల ప్రారంభించిన మెయిన్ కెనాల్ పూర్తయితే రిజర్వాయర్‌లోకి నీరు వస్తుందని తెలిపారు. గొట్టిముక్కుల, చింతపల్లి రిజర్వాయర్లకు భూసేకరణ, రోడ్డు సమస్య వల్ల పనులు ముందుకు సాగడం లేదన్నారు. భూములు కోల్పోతున్న రైతుల సమస్యను మానవతా దృక్పథంతో పరిశీలించాలని కలెక్టర్ నారాయణరెడ్డిని ఆదేశించారు. డిండి లిఫ్ట్ ఇరిగేషన్, ఎస్ఎల్‌బీసీ పనులు పూర్తయ్యేంత వరకు నెలకొకసారి సమావేశం ఏర్పాటు చేయాలని ఇరిగేషన్ శాఖాధికారులకు మంత్రి సూచించారు. కిష్టరాంపల్లి, చర్లగూడెం రిజర్వాయర్ల నిర్వాసితులకు రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో ఇండ్ల స్థలాను ఇప్పించాలని, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ద్వారా ప్రజలకు న్యాయం చేయాలని మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీంతోపాటు ఉదయసముద్రం కింద మునుగోడు నియోజకవర్గంలో ఆయకట్టును మరో 20 వేల ఎకరాలకు పెంచాలని, బునాదిగాని, రంగారెడ్డి, పిలాయిపల్లి కాల్వల స్థిరీకరణను కూడా పెంచాలని కోరారు. సమావేశంలో నీటిపారుదల శాఖా స్పెషల్ సెక్రటరీ ప్రశాంత్ జీవన్‌పాటిల్, ఇంజనీరింగ్ ఆఫ్ చీఫ్ అనిల్‌కుమార్, కలెక్టర్ నారాయణరెడ్డి, ఇరిగేషన్ ఈఈ శ్రీధర్‌రావు, ఆర్డీఓ శ్రీరాములు, డీఎస్పీ గిరిబాబు, సీఐ సురేష్, తహసీల్దార్ ఆంజనేయులు, ఎస్ఐ రాజు పాల్గొన్నారు.

రైతుల జీవితాల్లో వెలుగులు నింపుతాం

- దున్నపోతులగండి లిఫ్ట్ పనులను పరిశీలించిన మంత్రి ఉత్తమ్‌కుమారెడ్డి



దున్నపోతులగండి ఎత్తిపోతల పనులను పరిశీలిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మిర్యాలగూడ : రైతుల జీవితాల్లో వెలుగులు నింపడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఇరిగేషన్, సివిల్ సప్లయిస్ శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లి మండలంలోని చిట్యాల గ్రామ శివారులో నూతనంగా నిర్మిస్తున్న దున్నపోతులగండి లిఫ్ట్ పనులను నీటిపారుదలశాఖ ముఖ్య కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఎన్ఎస్పీ సీఈ అనిల్, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డితో కలిసి పరిశీలించారు. ఎన్ని ఎకరాల్లో లిఫ్టు ఏర్పాటు చేస్తున్నారు, ఎంత భూసేకరణ చేపట్టారు, ఎంత వ్యయం, నిల్వ సామర్థ్యం తదితర విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడుతూ 12,239 ఎకరాలకు సాగునీరు అందించేందుకు రూ.219.19 కోట్లతో దున్నపోతుల గండి, 8,610 ఎకరాలకు సాగునీరు అందించేందుకు రూ.259.25 కోట్లతో బొత్తలపాలెం, 2500 ఎకరాలకు రూ.32.22కోట్లతో వీర్లపాలెం-2, 316 ఎకరాలకు సాగునీరు అందించేందుకు రూ.9.30కోట్లతో తోపుచర్ల, 5875 ఎకరాలకు సాగునీరు అందించేందుకు 75.93కోట్లతో కేశవాపురం ఎత్తిపోతల పథకాల పనులు చేపట్టామన్నారు. వీటి పనులు సంవత్సర కాలంలోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వచ్చే ఏడాది ఆగస్టు 15న ఈ ఐదు లిఫ్టులను ప్రారంభిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి కోరిక మేరకు వాచ్యాతండా ఎత్తిపోతలతోపాటు మూడు చెక్‌డ్యామ్‌లను మంజూరు చేస్తామన్నారు. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ లిఫ్ట్ నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ నారాయణరెడ్డి, ఈఈ నాగేశ్వర్‌రావు, ఆర్డీఓ శ్రీనివాస్‌రావు, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, స్కైలాబ్‌నాయక్, పాదిల శ్రీనివాస్, తమ్మడబోయిన అర్జున్, గాయం ఉపేందర్‌రెడ్డి, బాలు, బాలునాయక్, ఎన్ఎస్పీ అధికారులు పాల్గొన్నారు.

జ్వర పీడితులకు వైద్య పరీక్షలు

- 'సాక్షి' కథనానికి స్పందించిన కలెక్టర్
- ప్రత్యేక బృందాలతో ఎర్రబెల్లి గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు
- దోమల నివారణకు మందుల పిచికారీ



గ్రామంలో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

నల్లగొండ టౌన్ : నిడమనూరు మండలం ఎర్రబెల్లి గ్రామంలో ఆదివారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 'సాక్షి' లో ఆదివారం 'పల్లె, పట్నానికి జ్వరం' శీర్షికతో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ సి.నారాయణరెడ్డి స్పందించి వెంటనే ఎర్రబెల్లి గ్రామాన్ని సందర్శించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్‌ను ఆదేశించారు. డీఎంహెచ్ఓ ఆదేశాల మేరకు ఆదివారం జిల్లా మలేరియా అధికారి ఆర్.దుర్గయ్య, డిప్యూటీ డీఎంహెచ్ఓ కేశ రవి ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య బృందాలు గ్రామాన్ని సందర్శించాయి. గ్రామంలో జ్వరంతో బాధపడుతున్న వారిని పరామర్శించి వారి ఆరోగ్య స్థితిగతులు అడిగి తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీ వద్ద ప్రత్యేకంగా వైద్య శిబిరం ఏర్పాటు చేసి జ్వరం, కీళ్ల నొప్పులతో బాధపడుతున్న వారి రక్తనమూనాలు సేకరించడంతో పాటు వారికి మందులు అందజేశారు. అనంతరం గ్రామంలోని అన్ని వీధులను పర్యటించి దోమల నివారణ కోసం మందులను పిచికారీ చేయించారు. అదే విధంగా నీటి తొట్లు, డ్రమ్ములు, కొబ్బరి చిప్పలు, బకెట్లు, గుంతలతో ఉన్న నీటి నిల్వను పారబోయించారు. దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలోని ప్రజల ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పద్మ, మోతీలాల్, రజని, మౌనిక, జోసెఫ్, మంజుల, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

వరద కాల్వకు నీటి విడుదల



వరద కాల్వకు విడుదలైన నీరు

పెద్దవూర : మండలంలోని పూల్యాతండా సమీపంలోని ఏఎమ్మార్పీ లోలెవల్ (వరద కాలువ)కు గ్రావిటీ ద్వారా ఆదివారం ఉదయం ఏఎమ్మార్పీ అధికారులు నీటిని విడుదల చేశారు. ఈ నెల 2వ తేదీన రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి పంప్‌హౌజ్ ద్వారా వరద కాల్వకు 450 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. 6వ తేదీన అనుముల మండలం మారేపల్లి సమీపంలోని 36వ కిలోమీటర్ వద్ద కాల్వకు గండి పడిన విషయం తెలిసిందే. గండిని పూడ్చివేయడంతో ఆదివారం నీటిని విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. జలాశయంలో 587 అడుగులకు పైగా నీరు ఉండటంతో గ్రావిటీ ద్వారా నీటిని విడుదల చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. మొదట 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేసిన అధికారులు సాయంత్రానికి 300 క్యూసెక్కులకు పెంచారు. సోమవారం 600 క్యూసెక్కులకు పెంచనున్నట్లు తెలిపారు.

చిన్నబోయిన పెద్దవాగు



పెద్దవూర సమీపంలో ఎండిపోయిన పెద్దవాగు

- పక్కనే కృష్ణమ్మ గలగలలు.. ఇక్కడ కనిపించని నీటిజాడ
- వాడుపడుతున్న పంటలు
- ఆందోళన చెందుతున్న రైతులు

పెద్దవూర : పెద్దవూర మండలానికి వరప్రదాయనిగా ఉన్న పెద్దవాగు నీరు లేక బోసిపోయింది. వాగుకు ఇరవై కిలోమీటర్ల దూరంలో ఉన్న కృష్ణా నది ఉరకలేస్తుంటే.. ఇక్కడి పెద్దవాగు ఎండిపోయింది. దీంతో వాగు ఆధారంగా సాగు చేసిన పంటలు వాడుబడుతున్నాయి. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాలుగైదు పర్యాయాలు తప్ప ఏనాడూ వాగు ఎండిపోయిన దాఖలాలు లేవు. వేసవిలోనూ వాగులో నీరు పారేది. కానీ, ఐదారు సంవత్సరాల నుంచి ఆగస్టు నెలలోనే పెద్దవాగు ఎండిపోతోంది.

పెద్దవాగు ప్రస్థానం ఇలా..

పెద్దవూర మండలం గుండా ప్రవహించే పెద్దవాగు నాంపల్లి మండలం పసునూరు చెరువు వద్ద పుట్టి గుర్రంపోడు, పీఏపల్లి మండలాల మీదుగా పెద్దవూర మండలంలోనికి ప్రవహిస్తుంది. ఏఎమ్మార్పీ ప్రాజెక్టు నిర్మాణం కాకమునుపు వర్షాకాలంలోనే ఈ వాగులో నీరు ప్రవహించేది. ప్రాజెక్టు నిర్మాణంతో కాలువల ద్వారా ఎప్పటికప్పుడు చెరువులను నింపుతుండడం, జంట నగరాలకు కృష్ణా జలాలను అందించే వాటర్ ప్లాంటును పదిహేను రోజులకోసారి కడుగుతుంటుండంతో నిత్యం నీళ్లు ప్రవహిస్తుంటాయి. దీంతో ఎప్పుడూ నీరు ప్రవహిస్తుండంతో వాగు సమీపంలో భూములు ఉన్న రైతులు వాగులో విద్యుత్ మోటార్లు వేసుకుని పైపులైన్లు తీసుకుని పంటలు, తోటలను సాగుచేసుకుంటున్నారు.

వందల ఎకరాల్లో సాగు

వాగును నమ్ముకుని పెద్దవూర, ఈదులగూడెం, పిన్నవూర, బట్టుగూడెం, కొత్తగూడెం, తెప్పలమడుగు, లింగంపల్లి, పెద్దగూడెం, చిన్నగూడెం గ్రామాలకు చెందిన రైతులు వాగువెంట వరినాట్లు వేశారు. వాగుకు రెండు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న భూములకు పైపులైన్లు వేసుకుని బత్తాయి తోటలను, పత్తి, మిరప పంటలను సాగు చేస్తున్నారు. వర్షాలు సరిగా పడకపోవడంతో బత్తాయి తోటలు, పత్తి, మిరప చేలకు నీటి అవసరం రాగా, ఒక్కసారిగా వరినాట్లు వేయడంతో విద్యుత్ మోటార్లు అన్నింటిని ఒకేసారి ఆన్ చేయడంతో వాగులో నీరు అయిపోతుంది. పైనుంచి నీరు రాకపోవడంతో వీరంతా దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. పెద్దవాగు ఎండిపోవడంతో వాగును నమ్ముకుని సాగు చేసుకుంటున్న రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాగు వెంట సుమారు వెయ్యి ఎకరాల్లో వరినాట్లు వేయడానికి రైతులు సిద్ధంగా ఉన్నారు. దీనికి తోడు వంద ఎకరాల వరకు బత్తాయి తోటలు, వేయి ఎకరాల్లో పత్తి, మిరప పంటలను సాగు చేస్తున్నారు. నీరు రాకపోవడంతో వీరంతా దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ప్రభుత్వం స్పందించి ఏఎమ్మార్పీ నుంచి కాలువలకు నీటిని విడుదల చేసి చెరువులను నింపి ఆదుకోవాలని మండల రైతులు కోరుతున్నారు.


మన ప్రాజెక్టుల గేట్లు పదిలమేనా..

- 2019 అక్టోబర్ 5న విరిగిన మూసీ రెగ్యులేటర్ గేటు
- దీనిస్థానంలో 2020లో కొత్తది బిగించిన అధికారులు
- 2021 ఆగస్టు 5న కొట్టుకుపోయిన పులిచింతల ప్రాజెక్టు క్రస్ట్ గేటు
- ఇప్పుడు తుంగభద్ర జలాశయం గేటు కొట్టుకుపోవడంతో మన గేట్లపై అనుమానాలు

నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లోని మూసీ, పులిచింతల గేట్లు పదిలంగానే ఉన్నాయా లేదా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. తుంగభద్ర ప్రాజెక్టు గేటు ఒకటి కొట్టుకుపోయిన నేపథ్యంలో జిల్లాలోని ప్రాజెక్టుల గేట్ల నిర్వహణ అంశం ఇప్పుడు తెరపైకి వచ్చింది. గతంలోనే మూసీ, పులిచింతల ప్రాజెక్టుల గేట్లు కొట్టుకుపోయిన విషయం విదితమే. ఈ ఏడాది కృష్ణానదికి వరద భారీగా వస్తుండడంతో సాగర్ క్రస్ట్ గేట్లను ఎత్తి పులిచింతల జలాశయానికి నీటిని విడుదల చేస్తున్నారు. మూసీ జలాశయం కూడా గరిష్ట నీటిమట్టానికి దగ్గరలో ఉంది. ఎగువ నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది.

– హుజూర్‌నగర్, కేతేపల్లి

నిధుల లేమి, సిబ్బంది కొరత, అధికారుల పర్యవేక్షణ లోపం వెరసి మూసీ గేట్ల నిర్వహణ ప్రశ్నార్థకరంగా మారింది. 1954–63 మధ్య కాలంలో మూసీ ప్రాజెక్టును నిర్మించారు. ప్రాజెక్టు నిర్మాణ సమయంలో 10 స్కవర్‌గేట్లు, 8 రెగ్యులేటర్ గేట్లు, 12 క్రస్ట్‌గేట్లను ఏర్పాటు చేశారు. ప్రాజెక్టు నిర్మించిన నాటి నుంచి గేట్ల నిర్వహణకు నిధుల కేటాయింపు లేకపోవటంతో గేట్లు శిథిలావస్థకు చేరి లీకేజీలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో 2014లో ప్రభుత్వం మూసీ ఆధునీకరణకు రూ.19 కోట్లు కేటాయించింది. ఈ నిధులతో 2015–16లో ప్రాజెక్టుకు క్రస్ట్, రెగ్యులేటర్ గేట్లు కొత్తవి బిగించారు. ఆ తర్వాత నుంచి కూడా గేట్ల నిర్వహణకు నిధుల కేటాయింపు లేదు. దీంతోపాటు ఏళ్ల తరబడి ప్రాజెక్టు వద్ద సిబ్బంది పదవీ విరమణలే తప్ప కొత్తగా నియామకాలు లేవు. దీంతో గేట్ల నిర్వహణపై పర్యవేక్షణ కరువై 2019 అక్టోబర్ 5న వరద ఉధృతికి 5 నంబర్ రెగ్యులేటర్ గేటు కొట్టుకుపోయింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 645 అడుగులు కాగా అప్పుడు నీటిమట్టం 644.8 అడుగులకు చేరుకుంది. ఆ సమయంలో ఎగువ నుంచి 1500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. ప్రాజెక్టులో నీటిమట్టం గరిష్టస్థాయికి చేరాక.. ఎగువ నుంచి ఇన్‌ఫ్లో వస్తున్నా అధికారులు గేట్లు ఎత్తకపోవటం వల్లే ఒత్తిడి పెరిగి గేటు విరిగిపోయిందని అప్పట్లో విమర్శలు వచ్చాయి. నూతన గేట్లు అమర్చిన మూడేళ్లకే రెగ్యులేటర్ గేటు విరిగిపోయిన సంఘటన అప్పట్లో జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. పనుల్లో కాంట్రాక్టర్ పాటించిన నాణ్యతా ప్రమాణాలు, అధికారుల పర్యవేక్షణపై అనుమానాలు వ్యక్తమయ్యాయి.



మూసీ రెగ్యులేటర్ గేటు విరిగిపోవడంతో వృథాగా పోతున్న నీరు (ఫైల్)



ప్రాజెక్టు క్రస్ట్‌గేటు కొట్టుకుపోవడంతో పులిచింతల నుంచి దిగువకు వెళ్తున్న నీరు (ఫైల్)

ఏడాది తర్వాత కొత్తగేటు

కొట్టుకుపోయిన గేటు స్థానంలో అధికారులు స్టాప్‌లాక్ గేట్ ఏర్పాటు చేసి నీటి వృథాకు తాత్కాలికంగా అడ్డుకట్ట వేశారు. అప్పటికే గేటు విరిగిపోయి ఐదు రోజులు కావటంతో మూసీ రిజర్వాయర్ పూర్తిగా ఖాళీ అయింది. అయితే అదే నెలలో భారీ వర్షాలు కురవటంతో ప్రాజెక్టు మళ్లీ పూర్తిస్థాయిలో నిండింది. ఆయకట్టులో సాగుకు ఇబ్బంది లేకుండాపోయింది. అనంతరం 2020 వేసవిలో కొట్టుకుపోయిన కొత్త గేటు బిగించారు.

2021లో కొట్టుకుపోయిన పులిచింతల క్రస్ట్ గేటు

సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలం నెమలిపురి దిగువన కృష్ణానదిపై పులిచింతల ప్రాజెక్టు నిర్మాణాన్ని దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో మొదలు పెట్టారు. సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో పూర్తయింది.2013 డిసెంబర్ 7న ప్రాజెక్టును జాతికి అంకితం చేశారు. ఈ ప్రాజెక్టు క్రస్ట్‌గేటు 2021 ఆగస్టు 5 తేదీన వరద ఉధృతికి కొట్టుకుపోయిన విషయం విదితమే. ఎగువ నుంచి వస్తున్న వరద ఉధృతిని నియంత్రించేందుకు అధికారులు ప్రాజెక్టు క్రస్ట్ గేట్లు పైకిఎత్తారు. ఈ క్రమంలో ఆ రోజు తెల్లవారు జామున 3.45 గంటల సమయంలో 16వ నంబర్ గేటు ఎత్తుతున్న సమయంలో గేటు కొట్టుకుపోయింది. ఆ సమయంలో ప్రాజెక్టులో 44 టీఎంసీల నీరు ఉండగా దాదాపు లక్ష క్యూసెక్కులకుపైగా ఇన్‌ఫ్లో వచ్చింది. కొట్టుకుపోయిన క్రస్ట్‌గేటు స్థానంలోఆగస్టు 7వతేదీ రాత్రి స్టాప్‌లాక్ ఎలిమెంట్స్‌తో ప్రత్యామ్నాయ గేటు అమర్చారు. దీంతో ఆ గేటు ద్వారా నీటి విడుదల నిలిచి పోయింది. మిగతా గేట్లు ఎత్తడం ద్వారా నీటి విడుదల కొనసాగింది. 2023 జూలై 31న కొత్త క్రస్ట్ గేటును అమర్చారు.

ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

నల్లగొండ టూటౌన్ : నిజామాబాద్‌లో ఈనెల 16వ తేదీ నుంచి 19వ తేదీ వరకు జరిగే ఫుట్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఆదివారం నల్లగొండలో నిర్వహించిన పోటీల్లో మహిళా జట్టును ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బండారు ప్రసాద్, జిల్లా చైర్మన్ గంటరెడ్డి మాట్లాడుతూ ఫుట్‌బాల్ మహిళా క్రీడాకారులు నిజామాబాద్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటి నల్లగొండకు పేరు తేవాలన్నారు. అనంతరం ఓరుగంటి రాములు ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు స్పోర్ట్స్ డ్రెస్సులు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఓరుగంటి శ్రీనివాస్, రావుల శ్రీనివాస్‌రెడ్డి, రావిరాల వెంకట్, మోత్కూరి యాదయ్య, బొడ్డుపల్లి సునీత, వెంకట్, కరుణాకర్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తాళం వేసిన ఇంట్లో చోరీ

- 2 తులాల బంగారు ఆభరణాలు, 8 తులాల వెండి అపహరణ

నేరేడుచర్ల: తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలో శనివారం రాత్రి జరిగింది. ఎస్ఐ రవీందర్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. పాత నేరేడుచర్లలో నివాసముంటున్న నూకల జానకమ్మ శనివారం సాయంత్రం ఇంటికి తాళంవేసి పెన్‌పహాడ్ మండలం నారాయణగూడెంలో ఉంటున్న తన అక్క ఇంటికి వెళ్లింది. గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించి బీరువాలోని 8 తులాల వెండి, 2 తులాల బంగారు ఆభరణాలతో పాటు రూ.50వేల నగదు ఎత్తుకెళ్లారు. జానకమ్మ ఆదివారం ఇంటి తిరిగి వచ్చేసరికి తాళాలు పగులగొట్టి ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించింది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మంత్రి సంతాపం


నివాళులర్పిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

నల్లగొండ: ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ అల్లం ప్రభాకర్‌రెడ్డి సతీమణి అల్లం ఉమారాణి ఆకస్మిక మృతి పట్ల రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సంతాపం ప్రకటించారు. ఆమె మరణ వార్తను తెలుసుకున్న మంత్రి ఆదివారం సాయంత్రం హుటాహుటిన హైదరాబాద్‌లో అల్లం ప్రభాకర్‌రెడ్డి ఇంటికి చేరుకుని ఉమారాణి పార్థివదేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం ఆయన కాంగ్రెస్ నాయకుడు అల్లం ప్రభాకర్‌రెడ్డిని పరామర్శించారు. మంత్రి నల్లగొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్‌నాయక్ ఉన్నారు.

పీఈటీ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత


జావెద్ కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ప్రిన్సిపాల్ ఫారూఖ్

గుర్రంపోడు: మండలంలోని పిట్టలగూడెం గ్రామ మైనార్టీ బాలుర జూనియర్ కళాశాలలో జూలై 15న గుండెపోటుతో మృతిచెందిన పీఈటీ షేక్ జావెద్ కుటుంబానికి మైనార్టీ గురుకులాల ఔట్ సోర్సింగ్, కళాశాలల సిబ్బంది, పీఈటీల సంఘం ఆధ్వర్యంలో రూ.1.90లక్షలు ఆర్థికసాయం అందజేశారు. ఆదివారం మైనార్టీ గురుకుల కళాశాలల రీజినల్ కోర్డినేటర్ విష్ణుమూర్తి, ప్రిన్సిపాల్ మహ్మద్ ఫారూఖ్ కలిసి జావెద్ కుటుంబ సభ్యులకు చెక్కు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ వార్డెన్ షేక్ సయ్యద్‌మియా, పీఈటీ కోటేష్ పాల్గొన్నారు.

నేరరహిత సమాజ స్థాపనలో ప్రజల భాగస్వామ్యం కీలకం

- నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి

నల్లగొండక్రైం: నేరరహిత సమాజ స్థాపనలో ప్రజల భాగస్వామ్యం కీలకమని నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి అన్నారు. శనివారం రాత్రి నల్లగొండ పట్టణంలో నాకా బందీ నిర్వహించారు. నంబర్ ప్లేట్లు లేని వాహనాలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం, గంజాయి సేవించే వారిని అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు. నల్లగొండ సబ్ డివిజన్ పరిధిలో మిషన్ పరివర్తన్‌లో భాగంగా 57 పాఠశాలల్లో అవగాహన కల్పించామన్నారు. చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై 7864 కేసులు నమోదు చేసి రూ.26, 77,705 జరిమానా విధించామని పేర్కొన్నారు.


తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను కలిపే బ్రిడ్జిపై భారీగా నిలిచిపోయిన వాహనాలు


సాగర్ జలాశయంలో ఈత కొడుతున్న పర్యాటకులు


సాగర్ కుడి కాల్వ నుంచి పర్యాటకులతో వెళ్తున్న లాంచీ


సాగర్ డ్యాం నుంచి విడుదలవుతున్న నీటిని వీక్షిస్తున్న పర్యాటకులు


సెల్ఫీ తీసుకుంటున్న పర్యాటకులు


నాగార్జునసాగర్ డ్యాం పరిసరాల్లో కిటకిటలాడుతున్న పర్యాటకులు

ఆలోచన అదుర్స్


కోళ్లకు దాణా, వాటర్ అందించేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక లైన్లు

- ఆధునిక పరిజ్ఞానంతో కోళ్లఫాం నిర్వహిస్తున్న రామన్నపేట యువకుడు
- కోళ్లఫాంలో ఆటోమెటిక్ ఫీడింగ్, డ్రింకింగ్ సిస్టం ఏర్పాటు

రామన్నపేట: కోళ్లఫాం నిర్వహణలో ఆధునిక పరిజ్ఞానం ఉపయోగిస్తూ సత్ఫలితాలు సాధిస్తున్నాడు రామన్నపేటకు చెందిన మాంద్ర సత్యనారాయణ. కోళ్లఫాంలో ఆటోమెటిక్ ఫీడింగ్, డ్రింకింగ్ సిస్టం అమర్చి నిర్వహణ ఖర్చును తగ్గించడంతో పాటు దాణా, నీటిని పొదుపు చేస్తున్నాడు. రామన్నపేటకు చెందిన మాంద్ర లచ్చయ్య, గాలమ్మల కుమారుడు మాంద్ర సత్యనారాయణ డిగ్రీ వరకు చదివాడు. స్వయం ఉపాధి కోసం పట్టణ శివారులో 5వేల సామర్థ్యం గల రెండు పౌల్ట్రీ షెడ్‌లను నిర్మించి ఉపాధి పొందుతున్నాడు. ప్రారంభంలో నిర్వహణ ఖర్చులు అధికమవ్వడం, కోళ్ల వ్యాధుల బారినపడి పరిమితికి మించి చనిపోవడం, దాణా వినియోగం ఎక్కువవ్వడం మూలంగా ఆశించిన లాభాలు రాలేదని, దీంతో ఖర్చులు, నష్టాలను అధిగమించడానికి ఆటోమెటిక్ ఫీడింగ్, డ్రింకింగ్ సిస్టంను ఏర్పాటు చేసినట్లు సత్యనారాయణ తెలిపారు.

ఆటోమెటిక్ సిస్టంతో అధిక ప్రయోజనాలు..

పిల్ల దశ నుంచి కోళ్లుగా ఎదిగే వరకు ఫీడ్, వాటర్ నేరుగా అందించేందుకు ఆటోమెటిక్ ఫీడింగ్, డ్రింకింగ్ సిస్టం దోహదపడుతుంది. రైస్ మిల్లుల్లో మాదిరిగా ఫీడ్‌ను ఒక గానుగలో పోస్తే మోటార్ యూనిట్ డ్రైవ్ ద్వారా హప్పర్‌లోకి, అక్కడి నుంచి యూనిట్ డ్రైవ్ ద్వారా ఫీడర్లలోకి వెళ్తుంది. ఫీడర్లు ఖాళీఅయిన కొద్దీ దాణా జరుగుతుంది. దీని ద్వారా దాణా వృథా అవ్వదు. ఫీడర్లలోని సందుల్లో నుంచి కోళ్లు దాణా తింటాయి. అదేవిధంగా ట్యాంక్ నుంచి నెప్పల్ సిస్టం ద్వారా ఏర్పాటు చేసిన డ్రిప్ ద్వారా పరిశుభ్రమైన నీరు కోళ్లకు చేరుతుంది. చుక్క నీరు కూడా షెడ్‌లో కిందపడే అవకాశం లేదు. అంతేకాకుండా షెడ్ మధ్యలో టేబుల్ ఫ్యాన్లు, సీలింగ్ ఫ్యాన్లతో పాటు, చలికాలంలో కోడి పిల్లలకు వెచ్చదనం కోసం వార్మింగ్ లైట్లను అమర్చారు. మిగిలిన కోళ్ల షెడ్‌లలోని కోళ్లతో పోలిస్తే ఈ విధానంలో తక్కువ రోజుల్లో తక్కువ దాణా వినియోగంతో కోళ్లు ఆశించిన దానికంటే అధిక బరువు ఉండడంతో పాటు అనారోగ్యంతో చనిపోయే కోళ్ల సంఖ్య చాలా వరకు తగ్గిందని సత్యనారాయణ చెబుతున్నారు. ఆటోమెటిక్ ఫీడింగ్ సిస్టం వల్ల నిర్వహణ ఖర్చు తక్కువవ్వడంతో పాటు దాణా వృథాకాకపోవడం, కోళ్లు రోగాల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉండడం, ఆశించిన స్థాయిలో ఎదగడం, కోళ్లు తక్కువగా చనిపోవడం వంటి బహుళ ప్రయోజనాలు కలుగుతున్నాయని పేర్కొన్నారు. షెడ్‌లో వాసన కూడా చాలా తక్కువగా ఉందని ఆయన చెబుతున్నారు.


నెప్పల్ సిస్టంలో ఏర్పాటు చేసిన లైన్ నుంచి నీటిని తాగుతున్న కోళ్లు

కోడి పిల్లల ఎదుగుదల బాగుంది



రెండు షెడ్‌లలో ఆటోమెటిక్ ఫీడింగ్ సిస్టం ఏర్పాటు చేశాను. ఒక్కో షెడ్‌కు రూ.2 లక్షల వరకు ఖర్చు అయ్యింది. ఒక్కడినే రెండు షెడ్‌లను నిర్వహిస్తున్నాను. రోజుకు రెండు గంటల సమయం కేటాయిస్తే సరిపోతుంది. మిగిలిన సమయంలో ఇతర పనులు చేసుకోవచ్చు. బ్యాచ్‌కు రూ.20వేల నుంచి రూ.25వేలు ఆదా అవుతుంది. కోడి పిల్లల ఎదుగుదల కూడా బాగుంది.

– మాంద్ర సత్యనారాయణ, కోళ్లఫాం నిర్వాహకుడు, రామన్నపేట


దాణా తింటున్న కోళ్లు

ప్రతి గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలి

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

ఆత్మకూర్(ఎస్): పూలే–అంబేడ్కర్ నాలెడ్జ్ సెంటర్స్ పేరుతో ప్రభుత్వం ప్రతి గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. ఆత్మకూర్(ఎస్) మండల పరిధిలోని నెమ్మికల్ గ్రామంలో మనం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రంథాలయాలు ప్రతిఒక్కరిలో పఠనాసక్తిని పెంచడంతో పాటు విజ్ఞానాన్ని పంచుతాయని అన్నారు. స్వాతంత్రోద్యమంలో గ్రంథాలయాలు కీలకపాత్ర పోషించాయని పేర్కొన్నారు. ప్రజల్లో విజ్ఞానాన్ని పెంచే గ్రంథాలయాలు సమాజానికి అవసరమని అన్నారు. నెమ్మికల్ గ్రామంలో స్వచ్ఛంద సంస్థల సహకారంతో గ్రంథాలయం ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. గ్రామస్తులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మనం ఫౌండేషన్ అధ్యక్షుడు గంపల కృపాకర్, దండ వెంకటరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ అద్దంకి జానమ్మ, వేల్పుల వెంకన్న, గంపల నారాయణ, పురం జాన్, గరిగంటి రజిత, ముత్తయ్య, అజయ్, పురం సైదులు తదితరులు పాల్గొన్నారు


నెమ్మికల్ గ్రామంలో గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తుల అరెస్ట్

- పరారీలో మరొకరు
- 745 గ్రాముల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం

కట్టంగూర్: గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఆదివారం సాయంత్రం కట్టంగూర్ పోలీసులు పట్టుకున్నారు. మరో వ్యక్తి పరారయ్యాడు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి కట్టంగూర్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ ఎన్. శ్రీనుతో కలిసి విలేకరులకు వెల్లడించారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. కట్టంగూర్ మండలం ఈదులూరు గ్రామానికి చెందిన కురిమిల్ల శివప్రసాద్, నామ శ్రీంకాత్ వృత్తి రీత్యా లారీ డ్రైవర్లు. నార్కట్‌పల్లికి చెందిన మంద మధు ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. వీరు ముగ్గురు కలిసి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో గుర్తుతెలియని వ్యక్తి నుంచి గంజాయి కొనుగోలు చేసి బ్యాగులో పెట్టుకుని ఆదివారం సాయంత్రం కట్టంగూర్ గ్రామ శివారులోని ఈదులూరు రోడ్డుకు చేరుకున్నారు. గంజాయి తరలిస్తున్నారని సమాచారం అందుకున్న కట్టంగూర్ ఎస్ఐ శ్రీను తన సిబ్బందితో ఈదులూరు రోడ్డుకు వెళ్లగా.. పోలీసులను చూసి వారు ముగ్గురు పారిపోతుండగా పోలీసులు వెంబడించారు. శివప్రసాద్, మధు పట్టుబడగా శ్రీకాంత్ పారిపోయాడు. నిందితుల నుంచి రెండు సెల్ ఫోన్లు, 745 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితులు గత సంవత్సరం కాలంగా గంజాయి వ్యాపారం చేస్తూ కట్టంగూర్, నార్కట్‌పల్లి మండలాల్లోని పలు గ్రామాల్లో యువకులు, విద్యార్థులకు చిన్నచిన్న ప్యాకెట్ల రూపంలో విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు. వీరి నుంచి గంజాయి కొనుగోలు చేసిన 20మందిని కూడా గుర్తించి కౌన్సిలింగ్ ఇచ్చినట్లు సీఐ తెలిపారు. పరారీలో ఉన్న నామ శ్రీనివాస్‌ను త్వరలోనే పట్టుకుంటామని పేర్కొన్నారు. ఎవరైనా గంజాయి తరలించినా, సేవించినా 8712670266 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని సీఐ తెలిపారు.


వివరాలు వెల్లడిస్తున్న సీఐ కొండల్‌రెడ్డి

పశుపోషణపై అవగాహన కల్పించాలి

- రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సమాఖ్య ఎండీ సుబ్బారాయుడు

కోదాడరూరల్: పశుపోషణలో మెళకువలపై రైతులకు అవగాహన కల్పించాలని రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సమాఖ్య మేనేజింగ్ డైరెక్టర్ సుబ్బారాయుడు అన్నారు. ఆదివారం కోదాడ పట్టణంలోని ప్రాంతీయ పశువైద్యశాలను ఆయన సందర్శించి మాట్లాడారు. పశువుల్లో ఆడ దూడలకు మాత్రమే జన్మనిచ్చే వీర్యనాళికల వాడకంపై పాడి రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ఈ విధంగా జరిగితే మగ దూడల సంతానం తగ్గి పోషణ భారం తగ్గుతుందని తెలిపారు. అదేవిధంగా గొర్రెలు, మేకల పెంపకానికి ఎన్ఎల్ఎం పథకం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీపై రుణాలు అందజేస్తున్నాయని అన్నారు. రైతులు వ్యవసాయంతో పాటు పాడి, జీవాల పెంపకం చేపడితే ఆర్థికంగా ఎదగొచ్చని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రాంతీయ పశువైద్యశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రాంతీయ పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పెంటయ్య, డాక్టర్ రమేష్ నాయక్, సిబ్బంది రాజు, సాగర్ ఉన్నారు.


కోదాడ ప్రాంతీయ పశువైద్యశాల ఆవరణలో మొక్క నాటుతున్న సుబ్బారాయుడు

సాగర్ ఎడమ కాల్వలో యువకుడి గల్లంతు


వెంకట్

గరిడేపల్లి: సాగర్ ఎడమ కాల్వలో యువకుడు గల్లంతయ్యాడు. ఈ ఘటన గరిడేపల్లి మండలం వెలిదండ గ్రామంలో ఆదివారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ పట్టణంలోని 14వ వార్డుకి చెందిన లక్ష్మమల్ల వెంకట్(21) ఆదివారం గరిడేపల్లి మండలం వెలిదండ గ్రామానికి చెందిన తన బంధువు కామళ్ల మరియారాణి కుమార్తె వివాహానికి హాజరయ్యాడు. ఈ క్రమంలో గ్రామ పరిధిలోని సాగర్ ఎడమ కాల్వలో స్నానం చేసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి కాలువలో పడి గల్లంతయ్యాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలం వద్దకు చేరుకుని వెంకట్ ఆచూకీ కోసం గజ ఈతగాళ్ల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు.

యాదాద్రిలో భక్తుల రద్దీ

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. శ్రావణమాసం తొలి ఆదివారం భక్తుల సందడి కనిపించింది. స్వామివారి ధర్మదర్శనానికి 3గంటలకు పైగా సమయం, వీఐపీ దర్శనానికి గంట సమయం పట్టిందని భక్తులు తెలిపారు. భక్తులు అధికంగా రావడంతో ఆలయ పరిసరాలు, క్యూలైన్లు, మాడ వీధులు, ప్రసాద విక్రయశాల, బస్టాండ్ వంటి ప్రాంతాలు నిండుగా కనిపించాయి. స్వామిని 40వేల మందికి పైగా భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. వివిధ పూజలతో నిత్యాదాయం రూ.53,45,736 వచ్చినట్లు ఆలయాధికారులు వెల్లడించారు.


ముఖ మండపం క్యూలైన్‌లో నిల్చున్న భక్తులు

స్వర్ణగిరిని దర్శించుకున్న మాజీ మంత్రి మల్లారెడ్డి


పూజలు చేస్తున్న మాజీ మంత్రి మల్లారెడ్డి

భువనగిరి: పట్టణ శివారులోని స్వర్ణగిరి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయాన్ని మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు పూజారులు ప్రసాదం, స్వామివారి ఫొటో అందజేశారు. అంతకుముందు పూజారులు స్వామివారికి సుప్రభాత సేవ, సువర్ణ తీర్థం, సహస్రనామార్చన, పద్మావతి అమ్మవారికి తిరుమంజనం, తోమాల సేవ, నిత్యకల్యాణం, తిరువీధి ఉత్సవసేవ తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

పులిచింతలకు తగ్గిన వరద ఉధృతి

హుజూర్‌నగర్: పులిచింతల ప్రాజెక్టుకు వరద ఉధృతి తగ్గింది. శనివారం 3,29,932 క్యూసెక్కులు వచ్చిన ఇన్‌ఫ్లో ఆదివారం 72,958 క్యూసెక్కులుగా నమోదైంది. దీంతో పులిచింతల ప్రాజెక్టులోని 2 గేట్లను 2.5 మీటర్లు పైకి ఎత్తి 32,638 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ద్వారా 16వేల క్యూసెక్కుల నీటిని దిగువన ప్రకాశం బ్యారేజ్‌కు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 45.77 టీఎంసీలు కాగా ప్రస్తుతం 34.28 టీఎంసీల నీరు ప్రాజెక్టులో ఉంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులతో పులిచింతల ప్రాజెక్టు పరిసరాలు సందడిగా మారాయి.

80 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి..

పులిచింతల ప్రాజెక్టులో అంతర్భాగంగా నిర్మించిన తెలంగాణ జెన్‌కో విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలోని నాలుగు యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. 16 వేల క్యూసెక్కుల నీటిని వినియోగిస్తూ 80 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసి గ్రిడ్‌కు అనుసంధానం చేసినట్లు ఎస్ఈ దేశ్యానాయక్ తెలిపారు.


ప్రాజెక్టు నుంచి దిగువకు విడుదలవుతున్న నీరు

వృద్ధ దంపతులపై కుమార్తె, అల్లుడి దాడి

- భూమి పంచాయితీ నేపథ్యంలోనే ఘాతుకం


గాయపడిన పద్మ

హుజూర్‌నగర్‌రూరల్: భూమి పంచాయితీలో వృద్ధ దంపతులపై వారి కుమార్తె, అల్లుడు, మనవడు దాడి చేసి గాయపరిచారు. ఈ ఘటన హుజూర్‌నగర్ మండలంలోని బోరుగడ్డ గ్రామంలో ఆదివారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. బోరుగడ్డ గ్రామానికి చెందిన చిరుమామిళ్ల పుల్లారావు, పద్మ దంపతులకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. పుల్లారావుకు ఉన్న మూడెకరాల 18 గుంటల వ్యవసాయ భూమి ఉండగా.. ముగ్గురు కుమార్తెలకు తలా ఎకరం చొప్పున పసుపు కుంకుమల కింద రాసి ఇచ్చాడు. పుల్లారావు, పద్మ దంపతులు గ్రామంలోనే ఉంటూ తమ పేరిట ఉన్న 18 గుంటల భూమితో పాటు కుమార్తెలకు ఇచ్చిన మూడెకరాల వ్యవసాయ భూమిని కౌలుకు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. పుల్లారావు దంపతులను తామ సాకుతామని, బదులుగా వారి పేరిట ఉన్న 18 గుంటల భూమిని తమ పేరిట రాయాలని హుజూర్‌నగర్ టౌన్‌లో ఉంటున్న వారి చిన్న కుమార్తె ఈడ్పుగంటి పావని, ఆమె భర్త రవి వేధిస్తున్నారు. దీనికి పుల్లారావు దంపతులు ఒప్పుకోలేదు. ఈ ఏడాది పుల్లారావు చిన్న కుమార్తె పావని, అల్లుడు గ్రామంలో ఓ రైతుకు వారి ఒకరం పొలంతో పాటు పుల్లారావు దంపతుల పేరు మీద ఉన్న 18 గుంటల భూమిని కౌలుకు ఇచ్చారు. అది తెలిసిన పుల్లారావు దంపతులు పొలం దగ్గరకు వెళ్లి కౌలుకు చేస్తున్న రైతును తమ పొలం దున్నొద్దని చెప్పారు. ఈ విషయం తెలిసిన పావని ఆదివారం ఆమె భర్త రవి, కుమారుడు మోహన్‌ను తీసుకొని పొలం వద్దకు వెళ్లి వారి వెంట తెచ్చుకున్న గొడ్డలి, కర్రతో పుల్లారావు దంపతులను కొట్టి అక్కడ నుంచి పారిపోయారు. అటుగా వస్తున్న రైతులు గమనించి వారిని 108 వాహనంలో హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.


హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పుల్లారావు దంపతులు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొండమల్లేపల్లి: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చందంపేట మండలం పోలేపల్లి గ్రామానికి చెందిన నాగిళ్ల నాగరాజు(35) సెంట్రింగ్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం హైదరాబాద్ వెళ్లేందుకు తన స్వగ్రామం నుంచి బయల్దేరి రాత్రి 9గంటల సమయంలో కొండమల్లేపల్లికి బస్టాండ్‌కు చేరుకున్నాడు. ఈ క్రమంలో బస్సు ఎక్కేందుకు రోడ్డు దాటుతుండగా నాగార్జునసాగర్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న గుర్తుతెలియని ద్విచక్రవాహనం అతడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నాగరాజును పోలీసులు చికిత్స నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తండ్రి సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ జగన్ తెలిపారు.

విద్యుదాఘాతానికి గురై..


గిరిధర్ (ఫైల్)

మోటకొండూరు: మండల పరిధిలోని ఇక్కుర్తి గ్రామంలో వీధిలైట్లు మార్చుతుండగా విద్యుత్‌దాఘాతానికి గురై తీవ్ర గాయాలపాలైన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఎస్ఐ పాండు తెలిపిన వివరాల ప్రకారం.. ఇక్కుర్తి గ్రామానికి చెందిన అయిలి గిరిధర్(23) శుక్రవారం గ్రామంలో వీధి లైట్లు మార్చుతుండగా విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు అతడిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడి తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.